# ఊగేవాడు జీవుడు ఊగనివాడు దేవుడు

రాగమును అరికట్ట నేరక యోగి యైనను పతను మందును
భోగమును విడనాడు వారికె యోగమది లభియించునయ్యా
కన్ను విప్పి చూడరోరన్నా శ్రీ సాయి దేవుడు
ఎన్నగా ఎందైన గలదన్నా.
గట్టు చేర్పు మటన్నవారికి గట్టి యోడను పట్టి చూడగ
పట్టుబట్టలు గట్టి భక్తుల చుట్టు తిరిగే పొట్టి స్వామిని
కన్ను విప్పి చూడరోరన్నా ఒట్టిమాటలు వాడుకాడన్నా
ఈ సాయి దేవుడు బుట్ట బొమ్మల చూడ బోదన్నా.

**విద్యార్థులారా!**

గడచిన వసంత కాలమైనను తిరిగివస్తుంది. క్షీణించిన చంద్రుడైనను తిరిగి అభివృద్ధి నొందుతాడు. కాని నరుని యౌవనము, నదీ జలము వెనుకకు తిరగవు. ఇట్టి పవిత్రమైన వయస్సునందు విద్యార్థులు దివ్యమైన, భవ్యమైన భావాన్ని వెదకటం అత్యవసరము. భగవంతుడు. అనుగ్రహించిన వరప్రసాదములలో కాలము అతి ప్రధానమైనది. కాలమును సార్థకము చేసే కర్మలు ఆచరించినప్పుడే కాయముగాని కర్మలుగాని సార్థకమవుతాయి. కాని ఈనాటి మానవుడు తనయొక్క జీవితములో అర్థభాగము తిండి నిద్రాదులతోనే గడపుతున్నాడు. మిగిలిన కాలమును వ్యర్థమైన మాటలచేతను, కోతి పనులచేతను నిరర్థకము చేసుకొంటున్నాడు. ఇంకా కొంత కాలమును దుర్నడతల చేతను ఇతరులను దూషించుట చేతను, ఇతరులను పరిహసించటము చేతను వ్యర్థము గావించుకొంటున్నాడు. ఉన్న కాలమును అధికముగా పరులచింతనలో ప్రవేశపెడుతున్నాడుగాని, స్వవిషయమునుగాని, దైవ విషయమునుగాని ఏమాత్రము చింతించుటకు ఉపయోగించటం లేదు. జీవితమంటే ఏమిటనే విషయాన్ని

sri sathyasaivachanamrutam

గుర్తించుటకు ప్రయత్నించటం లేదు. ఇంత పవిత్రమైన, దివ్యమైన, మానవజన్మమెత్తి కూడను ఈ మానవజన్మముయొక్క రహస్యముగాని, అంతరార్థముగాని గుర్తించటానికి పూనుకోవటం లేదు. మానవజన్మ మాటిమాటికి వచ్చేది కాదు. "బాట ఒక్కటేరా పాయకురా నీవు" ఆ మార్గమును మాత్రం ఏనాడు వదలి పెట్టకూడదు. ఏ మార్గమును మనము వదలి పెట్టకూడదు? ఎచ్చట నుండి వచ్చితిమో అచ్చటికి పోయే మార్గమును మాత్రం మనము విడువరాదు. అదే భాగవతము నందున్న మహామంత్రము. ఎచ్చట నుండి వచ్చితిమో అచ్చటికేగుట నైజము ప్రాణికోటికిన్! కనుక మానవత్వము లోపల పవిత్రమైన కాలమును సార్థకము గావించుకోటమే యదార్థమైన జన్మ రహస్యము.

ఈనాటి మానవునకు ఇంద్రియ నిగ్రహమంటే యేమిటో అర్థమే కాదు సంయమమంటే ఏమిటో ఏమాత్రం బోధపడదు. ఇలాంటి పరిస్థితియందు మానవుడు తనకు తోచినట్టుగా, ఇష్టానుసారముగా, స్వేచ్ఛావిహారము సలుపుతున్నాడు. ఈ స్వేచ్ఛా విహారమనేది మానవత్వాన్ని నిర్మూలనము గావించే మార్గమే తప్ప వేరొకటి లేదు. నిగ్రహశక్తియందు ఒక విధమైన ఏకాగ్రత ప్రారంభమవుతుంది. స్థిరత్వము కూడను ఏర్పడుతుంది. స్థిరత్వములేని మానవత్వము వ్యర్థము. మనము లక్ష్యాన్ని గుర్తించాలి. సత్యాన్ని అర్థము చేసుకోవాలి. ఇదే మానవుని ప్రధానమైన కర్తవ్యము. ద్రోణాచార్యులు విలువిద్య నేర్పే సమయమునందు అనేక రకములైన మార్గములను నిరూపిస్తూ వచ్చాడు. ఈ మార్గములలో ఏకాగ్రత, నిశ్చలత అనేవి మొట్టమొదట నేర్పటానికి పూనుకున్నాడు. ఈ రెండింటికిని లక్ష్యము చాలా ప్రధానము.

లక్ష్యమే లేకుండిన జీవితము అలక్ష్యమై పోతుంది. ఒక వృక్షమునకు ఒక పక్షిని కట్టాడు. కౌరవ సోదరులను, పాండవ సోదరులను పిలిచాడు. ఒక్కొక్క వ్యక్తిని నీవు ఏమి చూస్తున్నావని అడుగుతూ వచ్చాడు. అనేకమంది అనేక రకములైన జవాబులు చెప్పారు. చెట్టు కనిపించుచున్నది, చెట్టుకొమ్మ కనిపించుచున్నది. దానికి వెనుక భాగములో ఆకాశము కనిపిస్తుండాది. చెట్టుకొమ్మలో పక్షి కనిపిస్తుండాది. అని ఈ విధముగా అందరూ వర్ణిస్తూ వచ్చారు. ఎవ్వరు దీనికి సరైన అధికారులు కారని ద్రోణుడు నిర్ణయించుకున్నాడు. కట్టకడపట అర్జునుని పిలిచాడు. అర్జునా! నీవేమి చూస్తున్నావన్నాడు. అర్జునుడు గురూజీ! ఒక పక్షి తప్ప

srisathyasaivachanamrutam

అన్యము నాకు కనిపించటం లేదన్నాడు. దేనిని సాధించాలనుకున్నాడో, దేనిని అనుభవించాలనుకున్నాడో, దేనిని కొట్టాలనుకున్నాడో అది తప్ప అన్యము ఏమాత్రము మనకు కనిపించకూడదు. కనుకనే అప్పుడు ద్రోణాచార్యుడు ఈ విలువిద్యకు అర్జునుడొక్కడే సమర్థుడనుకున్నాడు. కారణమేమనగా లక్ష్యాన్ని మరవకూడదు. దృష్టిని చలింపచేయకూడదు. చలించని మనస్సును భ్రమించని దృష్టిని సాధించటమే సరియైన లక్షణము.

**లక్ష్యాన్ని అలక్ష్యము చేయకండి**

విద్యార్థులకు ఈనాడు లక్ష్యము చాలా ప్రధానము. అయితే ఈనాటి విద్యార్థులు లక్ష్యాన్ని అలక్ష్యము చేస్తున్నారు. కనుకనే అందుకోవలసిన దివ్యస్థానాన్ని అందుకోలేక పోతున్నారు. అనుభవించవలసిన శాంతిసుఖములు అనుభవించలేకపోతున్నారు. దివ్యత్వమునకు సమీపములో ఉండికూడను దివ్యత్వాన్ని విస్మరించి అపవిత్రమైన విషయవాసనలో ప్రవేశిస్తున్నారు.  కనుకనే ఎంతకాలము ఉండినప్పటికి పది సంవత్సరములు, పన్నెండు సంవత్సరములు, ఐదు సంవత్సరములు ఉండినప్పటికి వీరి భావము ఏమాత్రము మారలేకపోతున్నది. దీనికి కారణమేమిటి? ఆత్మ తత్త్వమును గుర్తించినట్టుగా వర్తిస్తున్నారేగాని ఆత్మతత్త్వము ఏమాత్రము వారికి అర్థము కావటము లేదు. దేహమే నేననే భావమనేటువంటి గొంగళిని కప్పుకోవటము చేత ఈ దివ్యత్వభావమును అర్థము చేసుకోలేక పోతున్నారు.

ఈ గొంగళి ఏమిటి? ఇదే మాయ, ఇదే అజ్ఞానము. దానిని కప్పుకోటంచేత జ్ఞాన స్వరూపమైన దివ్యత్వాన్ని గుర్తించుకోలేక పోతున్నారు. దీనికొక చిన్న తమాషా కథ.  ఒకనాడు భగవంతుడు మాయను పిలిచాడు. 'మాయా! నీ నుండి నాకు చాలా అపకీర్తి వస్తున్నాది. ప్రతి మానవుడు భగవంతుడు మాయోపాధి, మాయోపాధి అనటంచేత నాపేరుకు అగౌరవము కలిగిస్తున్నావు. నీవు నిరంతరము నావెంటనే, జంటనే ఉండటంచేతనే నీ అపకీర్తికి గురౌతున్నాను. కనుక ఇకపైన నావెంట ఉండటానికి వీలుకాదు నన్ను వదలి నీవెక్కడైనా దూరం వెళ్లిపో అన్నాడట.  మాయ చాలా వినయ విధేయతలతో నమస్కరించి దేవుడా! తప్పక నీ ఆజ్ఞ నేను శిరసా వహిస్తాను. కాని నీవు లేని స్థానమెక్కడో చెప్తే నేను అక్కడకు వెళతానన్నది. అపుడు భగవంతుడు నవ్వి నేను లేని స్థానము లేదు.  నీవు నేను జంట పక్షులమే. నీ జవాబు

sri sathyasai vachanamrutam

నిమిత్తమై నేనీవిధముగా ప్రశ్నించానన్నాడుట.

ఈనాడు ప్రతివ్యక్తి భగవంతుడు సర్వవ్యాపకుడు అంటున్నాడు. సర్వవ్యాపకుడు అని చెప్తున్నాడేగాని సర్వవ్యాపకమైన సత్యాన్ని దర్శించిన వ్యక్తి ఎక్కడా కనిపించటం లేదు. వారు ఈ పదములు అర్థము చేసుకొని ఉపయోగిస్తున్నారో, అజ్ఞానముతో ఉపయోగిస్తున్నారో నాకర్థం కావటం లేదు. ప్రతి విద్యార్థి స్వామి omini present, omnitient అని అనేక రకములగా పదములు ఉపయోగిస్తుంటారు. గ్రంథ పరిచయముతో, ఈ సర్వవ్యాపకత్వము సత్యమే. ఆ సత్యాన్ని అంతో ఇంతో అనుభవించటానికి ప్రయత్నించినప్పుడే చెప్పటానికి కూడను అధికారము వస్తుంది. అంతో ఇంతో అమృతమును గొంతులో పోసుకుంటే ఏదో కొంతైనా సరియైన ప్రాప్తి లభిస్తుంది. పవిత్రత లభిస్తుంది. కుండలు కుండలు అమృతము వెలుపల పెట్టినప్పుడు దీనివలన వచ్చే ఫలితము మనకు ఏమిటి ఉన్నది? ఈ సర్వవ్యాపకము మాటలతో ఉచ్చరించి భగవంతుని కూడా మోసము చేయటానికి ప్రయత్నించటం మహాపాపం. ఏ కొందరు మహనీయులో దీనిని గుర్తించటానికి ప్రయత్నిస్తూ వచ్చారు.

ఈనాటి చదువుల వలన ఈ సర్వవ్యాపకత్వాన్ని గుర్తించే అధికారము ఏ విద్యార్థియందు కనిపించటం లేదు. కారణమేమనగా ఇంద్రియములను నిగ్రహించే శక్తి కోల్పోవటం చేత ఈ సర్వవ్యాపకత్వాన్ని అర్థం చేసుకొనే శక్తి కూడను వీరికి లేకుండా పోతుండాది. కనుకనే మొట్టమొదట తమయొక్క రాగములను అరికట్టుకొనుటకై ప్రయత్నించాలి. చెప్పటము చేయటము ఒక్కటి కావాలి. అప్పుడే సర్వవ్యాపకత్వమనే దివ్యత్వాన్ని కొంతవరకైనా అర్థము చేసుకోవచ్చు. దేనిని ఆశ్రయిస్తే ఈ సత్యంమనకు అర్థమౌతుంది అని యోచించాలి. కాయలు కాయలను రక్షించలేవు. అన్ని కాయలను చెట్టే రక్షిస్తుంది. చెట్టును వేర్లు రక్షిస్తున్నాయి. కనుక ఈ వేర్లను మనము ఆశ్రయించినప్పుడే చెట్టు కాయలుకూడను మనకు లభ్యమౌతాయి. ఆ వేర్లను మనము సేవించినప్పుడే అనగా నీరు ఎరువులు పోసి రక్షించినప్పుడే ఆ చెట్టు పుష్కలముగా వర్ధిస్తుంది. అదేవిధముగనే సర్వమునకు భగవంతుడే ఆధారమనే సత్యాన్ని గుర్తించి దానినే సేవించినప్పుడు ఈ సర్వవ్యాపకత్వమనే సత్యాన్ని కొంత వరకునైనా మనము దర్శించగలుగుతాము.

srisathyasaivachanamrutam

**త్యాగరాజు - పోతరాజు - గోపరాజు**

ఆంధ్రదేశములో ముగ్గురు రాజులుండేవారు. ఒకడు త్యాగరాజు. రెండవవాడు పోతరాజు. మూడవవాడు గోపరాజు. గోపరాజు, త్యాగరాజు, పోతరాజు వీరు ఆధ్యాత్మిక రాజులు. పోతరాజే పోతన. మహా భాగవతాన్ని రచించిన మహా గుణవంతుడు. బావయైన శ్రీనాథుడు పోతరాజుయొక్క కష్టములను గుర్తించి అతనిని ఏదో ఒక విధముగా సుఖ పెట్టాలనే ఉద్దేశ్యముతో వచ్చి బావా! నీ ఇంటి పరిస్థితి నాకు తెలియనిది కాదు. తినటానికి తిండిగాని కట్టటానికి బట్టగాని, ఉండటానికి కొంపగాని లేకుండా అవస్థల పాలౌతున్నావు. నీకవిత్వమునంతా కేవలము శ్రీరామచంద్రునికి అర్పితము గావిస్తున్నావు. దీనివలన లభించే ఫలితము మనకు ఏమాత్రము గోచరించటం లేదు. ప్రాకృతమైన జీవితానికి ప్రత్యక్షమే అవసరము. నీ కవిత్వమును రాజుకు అర్పితము గావించుకుంటే నీకు రత్నాల అభిషేకము జరుగుతుంది అన్నాడు. పోతనకు మనస్సు చాలాకష్టమై పోయింది. "ఇక్కూళలకిచ్చి పడుపుకూడు భుజించుటకంటె హాలికుడైన నేమి?" అహంకార స్వరూపులైన రాజులకు నా కావ్యమును అంకితమిచ్చి వారు పడవేసిన అన్నమును భుజించి నేను జీవించే దానికంటే భూమిని ఆశ్రయించి దానిని దున్ని నేను బ్రతకటం చాలా పవిత్రమైనది అన్నాడు.

పోతన తన సర్వస్వమును భగవంతునకు అర్పించటము చేత భాగవతము జగద్వ్యాప్తి గావించినది. అసలు భాగవతము వ్రాయుటకు పూర్వమే

**పలికెడిది భాగవతమట**
**పలికించెడి వాడు రామభద్రుండట నే**
**పలికిన భవహర మగునట**
**పలికెద వేరొండు గాథ పలుకగ నేలా!**

అన్నాడు. వ్రాసేవాడూ తానే, పలికించేవాడూ తానే, పొందేవాడూ తానే, ఆనందించే వాడు తానే అని తనపైన ఏ బాధ్యతను పెట్టుకోకుండా అంతా భగవంతునికే అర్పితం గావించాడు. ఈ జగత్తునకు సృష్టి స్థితి లయ కారకుడు భగవంతుడే. సర్వశక్తి మయుడు, సర్వజ్ఞుడు అయిన భగవంతునికి అర్పితము గావించకుండా పామరులైనవారు, అహంకార ఆడంబరములతో తులతూగేవారికి ఇది అర్పితము గావించటము నాకిష్టము లేదన్నాడు.

srisathyasai vahini.org

ఇంక త్యాగరాజు ఇతడు అవస్థ పొలౌతున్నది చూచి తంజావూరు రాజు అనేక వస్తు వాహనాలు, కనక రాసులతో పల్లకి పంపించాడు. చూచాడు త్యాగరాజు. నవ్వినాడు. 'నిధి చాలా సుఖమా? ఈశ్వర సన్నిధి చాలా సుఖమా? నిజముగ తెల్పుము మనసా?' అన్నాడు. నాకు కావలసినది రామ సన్నిధే అదే నా పెన్నిది. నాకీ సామాను అక్కర లేదని వెనుకు పంపించాడు. తన పేరుకు తగినట్టి త్యాగము గావించాడు. సర్వము భగవంతుడే అన్య పదార్థములుగాని అన్యుల యొక్క సహాయముగాని నాకక్కరలేదని వెనుకకు నెట్టినవాడు త్యాగరాజు. ఇక గోపరాజు భద్రాచల రాముని ఆశ్రయించినాడు. తన జీవితమును, తాను సంపాదించే సమస్త ద్రవ్యమును భగవంతునికి అర్పితము గావిస్తూ వచ్చాడు. తాను తహసీల్దారుగా పనిచేస్తూ చెల్లించిన కప్పమును కూడను భగవంతునికి మందిరము నిర్మించటానికి, భగవన్మందిరము compound నిర్మించటానికి, భగవంతునికి అలంకారము చేయటానికి వినియోగపెడుతూ వచ్చాడు. తానీషా అతనిని బాధపెట్టినప్పుడు నేను రామార్పితమైన వాడినేగాని కామార్పితుడిని కాదు. నేను సంపూర్ణముగా రామార్పితమైన వాడను అన్నాడు.

ఈ మువ్వురు కూడను సర్వవ్యాపకమైన దివ్యత్వాన్ని గుర్తించారు. ఇంతేకాదు. సర్వరక్షకుడు కూడను భగవంతుడేయని విశ్వసించినవారు. వీరే నిజమైన భాగవతులు. భగవంతుడు సర్వత్రా కనుపిస్తున్నాడుగాని ఈనాటి వారికి భగవంతుడు ఎక్కడను కనిపించటం లేదు. ఈనాటి భాగవతులు కేవలము బాహ్య సంబంధమైన రక్షణకోసం ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వము యొక్క రక్షణ కావాలి. గూర్ఖాల రక్షణ కావాలి. వీరు కేవలము పొట్టకూటి భాగవతులేగాని భగవదర్పితమైన భాగవతులు కారు. సర్వ రక్షకుడు భగవంతుడే అని అర్పితము గావించుకొని ఎట్టి భీతులు ఎట్టి భయములు లేకుండా స్వేచ్ఛగా సంచరిస్తూ వచ్చారు ఆనాటి భాగవతులు. ఆనాటి భక్తులు భగవంతుడు సర్వవ్యాపకుడు అని చెప్పటములో ఒక అధికారము ఉంటుండాది. ఈనాడు సర్వవ్యాపకుడు అని చెప్పే భక్తులు సమయస్ఫూర్తిగా ఈ పదమును ఉపయోగ పెట్టుకుంటారు.

**జీవితము సార్థకం చేసుకోండి**

ఒక వ్యక్తి ప్రయాణమై వెళుతున్నాడు. శ్మశానమునకు సమీపమున ఒక ఆశ్రమము

sri sathyasai vahini fan

ఉండేది. అమితంగా ఎండలు ఉండటం చేత ఈ ఆశ్రమములో ప్రవేశించి కొంతకాలమైనా విశ్రాంతి తీసుకొని పోదామని ఆ వ్యక్తి ఆ ఆశ్రమములో ప్రవేశించాడు. ఆశ్రమములో వుండిన గురూజీ అనేకమంది భక్తులను జేర్చుకొని వారికి యేదో సత్సంగ కాలక్షేపం చేస్తుండినాడు. ఈ మహనీయుని సమావేశము చాలా అదృష్టవంతమైనది. ఊరకరారు మహాత్ములన్నట్లు ఈ పవిత్రమైన అవకాశము నాకు లభించినదని కొంతసేపు తానుకూడను శ్రవణము చేస్తూ కూర్చున్నాడు. సాయంకాలమై పోయింది. గురువుతోపాటు శిష్యులతోపాటు తాను బయటకు వచ్చాడు చల్లనిగాలిని అనుభవించే నిమిత్తమై. అప్పుడు ఒక విచిత్రమైన దృశ్యము కనిపించింది. అందరూ దిగ్భ్రాంతి చెందారు. ఏమిటి ఈ దృశ్యము? ఏమిటి ఈ పదార్థము? ఏమిటి ఈ ఆకారము అని అందరు ఆశ్చర్యముతో ఉన్నారు. గురూజీ! చిరునవ్వు నవ్వుతూ ఇది మరణించిన వాని దేహము. దీనిని నక్కలు కుక్కలు ఎత్తుకుపోవటానికి ప్రయత్నిస్తున్నాయి. తెల్లవారి పూడ్చిన ఈ శవాన్ని నక్కలు తీసుకొనిపోతున్నాయి. ఇంత లోపల ఒక పెద్ద నక్క పరుగెత్తి వచ్చింది. వచ్చి అవి, అవి ఆ భాషలో ఏమి మాట్లాడుకుంటున్నాయో ఏమిటోగాని శవాన్ని వదలిపెట్టి నక్కలన్నిటిని వెంట తీసుకుపోయింది అన్నాడు. చిక్కిన శవాన్ని దక్కించుకొనకుండా వదలిపెట్టి పోవటంలోని అంతరార్థ మేమిటని గురువును ప్రశ్నించారు శిష్యులు.

గురువు కొంతసేపు కన్నులు మూసుకొని పరిస్థితిని చక్కగా గుర్తించిన తదుపరి శిష్యులకు విషయాన్ని చక్కగా విపులంగా వివరిస్తూ వచ్చాడు. నాయనలారా! ఈ శవము జీవిత పరిస్థితి చాలా విచిత్రమైనది. బ్రతికినంత కాలము భగవద్వాక్యములుగాని, పెద్దల వాక్యములుకానీ ఏమాత్రము శ్రవణము చేయలేదు. శ్రవణము చేసినప్పటికినీ దానిని అనుసరించలేదు. అనగా పాటించలేదు. భగవదాజ్ఞను ఉల్లంఘించిన నేత్రములు మంచిని ఏనాడు ఈ వ్యక్తి చూడలేదు. ఎప్పుడు చూసినా కాకి దృష్టివలె అటు ఇటు చూచే దృష్టేకాని సార్థకమైన, పవిత్రమైన, దివ్యమైన దృష్టి ఏనాడు ఈ కన్నులు చూడలేదు. ఇంక చేతులు చూస్తామా, సత్కర్మలలో ఏనాడు కూడను ప్రవేశించలేదు. అందరి సొత్తును తీసుకోటానికి ప్రయత్నించిన హస్తములేగాని ఎవరికైనా పట్టెడన్నము పొట్టకు పెట్టిన చేతులు కావు. ఇక పాదములు చూస్తామా కుక్కలవలె బజారు బజారు తిరిగిన పాదములేగాని, ఏ దేవాలయమునకో ఏ సత్సంగమునకో, ఏ యాత్రకో, ఏ క్షేత్రమునకో ప్రయాణము చేసిన పాదములు కాదు. కనుక ఇలాంటి అపవిత్రమైన ఈ దేహమును



sri sathyasai vachanamrutam

నక్కలైన మనము ముట్టరాదు తినరాదు. ముట్టినంత మాత్రమున ఈ పాపము మనకు కూడ లభిస్తుందని ఆ వచ్చిన పెద్ద నక్క వీటికి బోధించినట్టుగా గురువుగారు చెప్పారు.

కనుక మనము మరణించిన తరువాత మన దేహము ఏమైతే మనకేమి అని అలక్ష్యము చేయరాదు. దేహానికి కూడా సార్థక్యము కావాలి. అందు నిమిత్తమై ఈనాడు మనము సత్కర్మలు చెయ్యాలి. మనము పవిత్రమైన దృష్టిని అభివృద్ధి గావించుకోవాలి. విన్నటువంటి, చెప్పినటువంటి వాక్యాల్ని మనము తప్పక నడచుకోవాలి. పవిత్రమైన మాటలు మనము మాట్లాడాలి. మన దేహమందున్న సర్వాంగములను సార్థకమైన కర్మలలో ప్రవేశపెట్టాలి. అట్లు పెట్టకున్న నక్కలు కూడ ఈ దేహాన్ని ఏమాత్రం ఇష్ట పడవు. మానవదేహము చాలా పవిత్రమైనది. 'జంతూనాం నర జన్మ దుర్లభం' అన్నారు. కర్మానుబందీని మనుష్యలోకే. మానవ లోకము లోపల కర్మల చేతనే ఈ దేహము లభించింది.

పరోపకారార్థ మిదం శరీరమ్ పరోపకారార్థ నిమిత్తమై ఈ దేహము మనకు లభించింది. ఇలాంటి దేహాన్ని మనము సాధ్యమైనంతవరకును తప్పులు లేకుండా సర్వాంగములను పవిత్రమైన కర్మలలో ప్రవేశపెట్టాలి. కానీ విద్యార్థులు ఈ మాటలుగాని, ఈ విషయాలుగాని చక్కగా గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. కృష్ణుడు అర్జునుడు ఇద్దరు ఎనభైఆరు సంవత్సరములు కలసి మెలసి జీవించినారు. ఇన్ని సంవత్సరములలో ఏ ఒక్క సమయములోకాని, ఏ సందర్భమునందుగాని, భగవద్గీతను గురించి ఏమాత్రము కృష్ణుడు ఉచ్చరించలేదు. కానీ మహాభారత యుద్ధ సమయమునందు మాత్రమే ఈ గీతను చక్కగా ప్రబోధించాడు. దేనికోసం ఇంతకాలము తాను ఊరుకున్నాడు? కాల కర్మ కారణ కర్తవ్యాలు కలసి వచ్చినప్పుడే ఇట్టి బోధలు మనకు లభ్యమౌతూ ఉంటాయి. కనుకనే ఏ ఒక్క విషయమైనా చెప్పాలనుకున్నప్పుడు దానికొక సమయము ఏర్పడాలి.

**స్వామికి తెలియనిది లేదు**

స్వామికి అన్నీ తెలుసు. కానీ ఏమీ తెలియనట్లుగానే ఉంటుంటాడు లోకములోని మానవుల భావముకు దివ్యమైన భావమునకు ఉండినటువంటి వ్యత్యాసాన్ని మీరు గుర్తించాలి. దివ్యత్వము ఏరీతిగా వుంటుంటాదంటే అన్నీ తెలిసినప్పటికిని అన్ని శక్తులు ఉండినప్పటికిని,

sri sathyasai vachanamrutam

ఏమి తెలియనట్లుగా, ఏ శక్తి లేనట్లుగా నటిస్తాడు. మానవత్వం ఎలాంటిదంటే ఏమీ తెలియక పోయినప్పటికి, ఏ శక్తి లేకపోయినప్పటికీ, అన్ని తెలిసినట్లుగా అన్ని శక్తులు ఉండినట్లుగా భావిస్తాడు. ఇదే దానికి దీనికి ఉండిన వ్యత్యాసము. ఎవరో ఒక శిష్యుడు ప్రశ్నించినాడట. స్వామీ! జీవునకు దేవునకు ఉండిన వ్యత్యాసము ఏమిటి అని. వేదాంతములో దీనిని వివరించాలంటే పెద్ద గ్రంథము వ్రాయాలి. గురువు దీనికి రెండే రెండు మాటల్లో జవాబు చెప్పాడట. ఊరుకున్నవాడు దేవుడు, ఊగులాడేవాడు జీవుడు అన్నాడుట. అనగా చంచలమైనవాడు జీవుడు. స్థిరముగా ఉండేవాడు దేవుడు అని అర్థం. ఈ మానవత్వమనేది ఎప్పుడూ ఊరుతూ ఉండేదే. అయితే దీనికి కూడను ఒక సమయం రావాలి. కనుక విద్యార్థులు మొట్టమొదట గుర్తించవలసిన విషయము భగవంతుడు సర్వవ్యాపకుడు అనే సత్యాన్ని మాటలచేత కాకుండా క్రియలచేత కూడను మనం నిరూపించటానికి ప్రయత్నించాలి. ఎక్కడెక్కడ ఏ రూపములో ఏ విధముగా జరుగుతుండాదనేది స్వామికి తెలుసు. కాని దానిని ఉచ్చరించటానికిగాని, బోధించటానికిగాని, తిరిగి చెప్పటానికిగాని నేనే మాత్రము ప్రయత్నించను. కొంతకాలము నుంచి, ఎక్కువ కాలము ఇక్కడ ఉండినటువంటి విద్యార్థులయందే అనేక దోషములు వెలువడుతూ వస్తున్నాయి. దీనివల్ల క్రొత్త విద్యార్థులకు చిన్న విద్యార్థులకు పెడమార్గము నిరూపిస్తూ వస్తున్నారు.

కొంతమంది P.hd scholars చాలా చెడిపోయినవారు వీళ్ళంతా. పాత పందికొక్కుల మాదిరి ఇక్కడ ప్రవేశించి కొత్తవారిని mislead చేస్తూ ఉంటున్నారు. స్వామి విషయము చెప్పవలసి ఉన్నప్పుడు omnitient, omnipresent అని అన్నీ చెప్తారు. పదాలు ఉపయోగపెడుతూ ఉంటారు. కాని నిజంగా చూస్తే వారి హృదయాలు ఏమాత్రము శుభ్రమైనవికావు. ఇలాంటి విద్యార్థుల వలన నూతన విద్యార్థులకు, అమాయకులైన విద్యార్థులకు కొంత హాని జరుగుతూ వస్తూంటూంటాది. ఇది అజ్ఞానమో లేక అహంకారమో, ఎక్కువగా చదివిన వాళ్ళమని, ఇంకే విధమైన ఆడంబరమో చెప్పటానికి వీలుకాదు. నా ఉద్దేశ్యములో అజ్ఞానమూ కాదు. అహంకారమూ కాదు. ఇది కృతజ్ఞత లేని క్రూరత్వమనే చెప్పవచ్చు. ఇంతకాలము మన విద్యాసంస్థలో ఉంటుండి అన్ని విధములుగా స్వామి సంస్థల అంతరార్థమును గుర్తించినవారై, ఇంకా class leadersగా ఉంటుండి ఈ విధముగా ప్రవర్తించకూడదు.

**దుస్సంగము చాలా ప్రమాదకరమైనది**

ఎక్కడకాని మాట్లాడకూడదని ఒక నిబంధన పెట్టాము. ఏదైనా Subject విషయము వచ్చినప్పుడు వారు వారు సంప్రదించుకోవచ్చు. కానీ అధికముగా మాట్లాడకూడదని చెప్పాము. రూములోగాని ఇంకేవిధమైన దీన్లోగాని ట్రాన్సిస్టర్లుగాని టేపురికార్డులుగాని పెట్టుకొనకూడదని. అనవసరంగా ఒకరివల్ల ఇంకొకరికి చదవటానికి అభ్యంతరము ఏర్పడుతుందని కూడను చెప్పాము. అలాంటి పరిస్థితిలో ఈ రీసెర్చి స్కాలర్సుగా ఉండినవాళ్ళకు అంతమాత్రం జనరల్ నాలెడ్జి లేదా? కొంతమంది రూము లోపలనే టెలివిజన్లు పెట్టి చూపుతుంటారు. సినిమా తీయటానికని VCR పెట్టాము అదీ వాళ్ల స్వాధీనములో ఉంటుండాది. దానిలో ఏ ఫిల్మునైనా వేసుకోవచ్చు. చెప్పేది సాయిబాబాది కాని చూపేది మరొకటి. ఇలాంటి రాక్షసులు ఉండటం చేతనే ఈ సంస్థలంతా దెబ్బతింటున్నాయి. చెప్పి చెప్పి చాలా అలసి పోయినాను. పదిమందిలో చెప్తే వీళ్ల హృదయం కొంతవరకు కరుగుతుందో ఏమో అనే ఉద్దేశ్యముతో ఈనాడు చెప్పవలసి వచ్చింది. ఇంకపైన ఈ విధమైనవి రూముల్లో ఏది జరుగుతున్నది ఈ సమావేశములో ప్రత్యక్షంగానే నేను చెప్తాను. అప్పుడే వీరికి సరైన Punishment.

స్వామికి ఏమీ తెలియటం లేదులే, స్వామి ఏమీ చెప్పటం లేదులే, స్వామి ఏదీ చూడటం లేదులే అనే అజ్ఞానములో మునుగుతున్నారు. లేక వారికి లోపల ఇంకా ఒక ప్రత్యేకమైన అజ్ఞానము కప్పి ఉంటుండాది. ఎవరైనా వ్రాశారేమో, ఎవరైనా చెప్పారేమో అనుకుంటారు. ఇది కూడా పెద్ద అజ్ఞానమే. ఇక్కడి వాళ్ళదైతే ఎవరో చెప్పారు. ఎవరు వ్రాశారనుకోవచ్చు. దేశ దేశముల నుంచి వస్తున్నారే. వారి విషయాలంతా ఎవరు చెప్తున్నారు. అంతమాత్రము వీరికి జ్ఞానము లేదా? కేవలం చిల్లర బుద్ధులు. అయితే కొంతమంది మాత్రమే ఇట్లాంటి వారుంటున్నారు. మిగిలిన అనేకమంది ఎంతో మంచి పిల్లలంతా ఉంటున్నారు. పాపం ఈ చెడ్డవారివల్ల మంచివారికి అపకారము జరుగుతుంటుండాది. మనము నిద్రించే సమయములో ఒక్క దోమ వచ్చి మనలను కరుస్తుంది. ఈ దోమలంతా ఎక్కడ ఉంటున్నాయని మనం ఫ్లిట్ కొట్టేస్తాం. కరచిన దోమ ఒకటి చచ్చిపోయినవి అనేకం పాపం. అదేవిధముగా అపకారం చేసేది ఒక్కడుకాని అనేకమంది నిరపరాధులు శిక్ష అనుభవిస్తున్నారు. ఈ దురభ్యాసములకు, ఈ దుశ్చేష్టలకు పాతవారే కారణము. కనుక ఈనాటి నుండైనా వీరు తెలివి తెచ్చుకొని

srisathyasaivachanamrutam

సరియైన ఆదర్శముగా నిరూపించినప్పుడే అక్కడ ఉండటానికి వీలవుతుంది. లేకపోతే ఒక్కక్షణం కూడా ఇక్కడ పెట్టుకోటానికి వీలులేదు. కొత్త పిల్లలు నిరపరాధులు. పాపం కేవలం అజ్ఞానులు. ఏమీ తెలియని అమాయకులుగా ఉంటున్నారు. వారు టీచర్సుగా తయారైతే ఇంకా ఎంతమంది పిల్లలను పాడుచేస్తారో. కనుక ఇలాంటి వారు టీచర్సుగాగాని, స్కాలర్సుగాకాని ఎక్కడా ఉండటానికి వీలులేదు. నాకు ఒకరిద్దరు చిక్కినా చాలు. One teaspoon of cow milk is useful why barrels of donkey milk? కనుక మాకు పిల్లలు ఎక్కువ కావాలనే దురాశలేదు. తక్కువమందే ఉంటుండి ఎక్కువ గుణాన్ని పెంచాలి. ఇది నా ఆశయం.

### మా సంస్థ వ్యాపారసంస్థ కాదు

అందరూ ఏమీ తెలియనట్టుగానే ఉంటుంటారు. దీనికి తెలుగులో ఒక సామెత చెప్తూతారు. 'తేలు మాదిరి కుట్టటం, బల్లిమాదిరి అణగటం తేలువలెÿ poison ఎక్కిస్తారు. కాని బల్లివలె అణగిఉంటారు. వీరు పరమ భక్తులుగా show చేస్తూ ఉంటారు. నాముందు ఒక ఆట నావెనుక మరొకటి ఇలాంట÷ dummy dance వాళ్లు చాలామంది ఉంటున్నారు. నేను ఇంక దీనిని అంగీకరించను. ఇకపైన అన్నీ strict గానే పెట్టేసి అవసరములో ఉండినా సరే ఈ scholarship అంతా తీసేస్తాము. ఈ P.hdలు మాకక్కర లేదు. గుణవంతుడు ఒక్కడుంటే చాలు. దేశోద్ధరణ నిమిత్తమై, ధర్మోద్ధరణ నిమిత్తమై ఈనాటి విద్యార్థులంతా ఉత్తమ విద్యార్థులుగా అయినప్పుడు దేశమెంతో బాగుపడుతుందనే ఉద్దేశ్యముతో ఈ సంస్థను స్థాపించామేగాని ఒక వ్యాపారంగా మేము స్థాపించలేదు. భక్తులు ఎంతోమందికి వసతి గృహాలుగా ఇస్తాము. ఈ కాలేజీలే మాకు అక్కర లేదు. ఒక్కతూరి మూసేస్తాము. మరి అలాంటి అపకీర్తి పాలుకాకుండా చూసుకోండి. ఎవరికి వారు చక్కగా గుర్తించుకోటానికి ప్రయత్నించండి. మీరు పెద్దవారు పెద్దవారుగానే ఉంటుండాలి. కాని ఎద్దుల మాదిరి ప్రవర్తించకూడదు. దొడ్డవారు దొడ్డవారుగానే ఉంటుండాలిగాని గొడ్డువారిలాగ ప్రవర్తించకూడదు. అందరూ ఆ విధముగా ఉంటే జగత్తు ఇంకేమి బాగుపడుతుంది. బయటఉండే విద్యార్థులలో ఈ విధమైన దుర్గుణములు ఉండటం సహజమే. కాని సాయి సంస్థలలో మాత్రము ఇలాంటివారు ఉండకూడదు.

ఇన్ని దినముల నుండి ఎన్ని రకములుగానో బోధిస్తున్నాను. కాని ఏమి చేస్తున్నారు?



srisathyasaivachanamrutam

ఏమి అనుసరిస్తున్నారు? ఏమి ఆచరిస్తున్నారు? ఏమి ఆచరణలో పెట్టి అనుభవిస్తున్నారు? ఏమీ లేదు? మాటలు చూస్తే కోటలు దాటుతున్నాయి. స్పీకర్స్ మాత్రమే అయి ప్రయోజనం లేదు. వాకర్సు కావాలి. దీనికి తగిన రీతిగా నడచుకోవాలి. నూరు చెప్పే దానికంటే ఒకటి నడచుకొని చూపించు. ఆ విధముగా ఆదర్శప్రాయముగా మీరు రూపొందినప్పుడే ఈ సంస్థకు సత్కీర్తి వస్తుంది. మీ నుండి మేము ఒక్క నయాపైసా ఆశించలేదు. మీనుండి దేశోద్ధరణ కావాలని ఆశిస్తున్నాము స్వామికి కించిత్తు కూడను స్వార్థం లేదు. నాకున్న కాలములో ముక్కాలు భాగము మీకే ఉపయోగపెడుతున్నాను. ఉన్న ఒక్క భాగము ప్రపంచానికి ఉపయోగపెడుతున్నాను దీని చక్కగా మీరు అర్థం చేసుకోండి. మూడు భాగములు మీరు అనుభవిస్తుంటే ఒక్క భాగం ప్రపంచమంతా అనుభవిస్తుండాది. మీకెంత స్థానమిచ్చానో చూసుకోండి. ఈ విలువను మీరు పాడుచేసుకుంటున్నారు. మీ పవిత్రతను మీరు పాడుచేసుకుంటున్నారు.

**క్రమశిక్షణ లేకపోతే సహించను**

సంజయ్ సహాని చెప్పాడు ఈ అవకాశమును మీరు పాడు చేసుకో వద్దండీ అని. కాని చెప్పినవారు కూడను దీనిని అనుసరించటానికి ప్రయత్నించాలి. ఎవ్వరూకూడను దుర్వినియోగం చేయకూడదు. తిరిగి మనకు చిక్కదిది. 'చిక్కిన సాయిని వక్క చేయక చక్క చేసుకోండి; పోయిన చిక్కదు పర్తీశుని ఈ పాదసేవ యండి. భక్తిని యిచ్చి ముక్తిని చేర్చి చక్కగ దిద్దే తత్త్వమిది. ఇతరుల మాటలు ఇంపుగ నమ్మి కొంప తీయకండి. కనుక మీరు ఇతరుల విషయాల లోపల ఏమాత్రము ప్రవేశించకండి. అందరు తల్లిబిడ్డలవలె ఒకరినొకరు కలసిమెలసి ఉంటుండాలి. చాలామంది చెప్పుతుంటారు. ఈ హాస్టలు లోపల చిన్న చిన్న పిల్లల నుంచి పెద్ద పెద్ద P.hdల వరకు ఉండటంచేతనే discipline సరిగా జరగటంలేదని కంప్లైంటు. ఇది సరియైన సమాధానము కాదు. మీ ఇంటిలో చిన్నతమ్ముడు, పెద్దతమ్ముడు, మధ్యతమ్ముడు అందరు ఉంటారు. వీళ్లందరు ఉండటం వలన ఎంత కలసి మెలసి ఉంటున్నాం. నేను పెద్దవాణ్ణి. చిన్నతమ్ముడు నాఇంట్లో ఉండటానికి వీల్లేదని తరిమికొడతావా? వీరందరు మీ తమ్ముళ్లు కాదా! వీరందరితోను ఎందుకు కలసిమెలసి ఉండకూడదు. ఇది ఒక పెద్ద education.

ఐకమత్యము చాల ప్రధానమైన సంపద. అలాంటి విద్యనే నేర్పే నిమిత్తమై ఈ చిన్నపిల్లలను

sri sathyasaivachanamrutam

పెద్ద పిల్లలను ఒక హాస్టలులో పెట్టాము. అమాయకులైన పిల్లలకు సరైన మార్గాన్ని బోధించి, నేర్పించి వాళ్ళ ఆదర్శముగా నిరూపించాలి. అలాంటిదిపోయి చిన్న పిల్లలనంతా పెడమార్గములను పట్టించి వారికి సరియైన ఉపదేశములు లేకుండా మీరు చెప్పటమొకటి చేయటమొకటిగా ఉంటుంటే వారేం నేర్చుకుంటారు. మా టీచర్సు, మా రూము లీడర్సు వాళ్లే చెప్పినట్లు చేయటం లేదు. మేమెందుకు చెయ్యాలి అని వారు అలక్ష్యం చేస్తారు. కనుక మీరు రూమ్ లీడర్సు ఒక పెద్ద పరీక్షగా భావించాలి. కర్తవ్యమును శక్తి హీనంగా మీరు చూసుకోకుండా శక్తి ఉన్నంతవరకు నడచుకోవాలి. ఈ ఆజ్ఞను పాలించినప్పుడే అనుగ్రహానికి పాత్రులౌతారు. లేకుండా పోయినప్పుడు ఈ రాగద్వేషముల అనుగ్రహానికే మీరు గురౌతారు.

చదువులు ముఖ్యం కాదు. ఈ చదువులు చెత్త చదువులు. ఏదో నేను గొప్ప P.hd చేశాను, M.SC చేశాను, M.Com చేశాను అనుకుంటారు. ఇవంతా గొప్ప చదువులా ఇంత కాగితము ముక్క మీ ముఖాన కొట్టేటువంటిదే ఇది. ఈ డిగ్రీలు కాదు మీకు కావలసినది. మంచివాడనే పేరును తెచ్చుకోవాలి. 'కాకి వగుచు కలకాలము తిరుగక హంసవై క్షణమాడుమురా' అన్నారు. కాకిలాగ ఒక సంవత్సరము ఉండే దానికంటె హంసవలె రెండు నిముషములు ఉంటేచాలు. మంచిపేరు తెప్పించుకొని పోవాలి. ఎప్పుడు చూసినా ఒకదానినొకటి విమర్శించుకొని మాట్లాడటం. ఆర్గ్యుమెంట్సులో దిగటం మీకేమధికారం ఉంటుందాది? మీ స్థాయి ఏమిటి? మీకేమి తెలుసు? ఈ argumentsలో దిగే అధికారం నీకెక్కడిది? ఇలాంటి అధికారంలేని అధికారములో ప్రవేశించటంచేతనే అధః పతనమై పోతున్నారు. ఇంటిలో తల్లితండ్రులు చెప్పటం లేదు. స్కూల్లో టీచర్సు చెప్పటం లేదు. నేను చెప్పకపోతే మీగతి యేమై పోతుంది. కనుకనే మీ దోషములు మీకు చెప్పే నిమిత్తమై నేను వచ్చాను.

**మంచిగా ఉంటే నన్ను నేనే ఇచ్చుకుంటాను**

సందీప్ సహానీ చెప్పాడు తాటకి తమోగుణమని. తమోగుణం కాబట్టి ఆమెను రాముడు సంహరించాడు. అహల్య రజోగుణము ఆ రజోగుణమునకు బుద్ధి చెప్పి తిరిగి భర్తతో చేర్చినాడు. సీత సాత్త్వికము దానిని స్వీకరించినాడు. కనుక ఈ ఫిల్ములు చూడటము ఇవన్నీ చూపించటము యిదంతా రజోగుణము యొక్క తత్త్వము కాదా! ఈ దోషాన్ని నేను చెప్పకూడదా? చూపకూడదా?

sri sathyasaivachanamrutam

ఈ రజోగుణానికి చక్కగా బుద్ధి చెప్పి తిరిగి స్వస్థానమునకు చేర్చే నిమిత్తమై చెప్పవలసి వచ్చింది. ఇంకా కొంతమంది ఉంటున్నారు. ఒక్కో దినము ఒక్కొక్కరి పేరు చెప్తూ వస్తాను. అప్పుడే మీ గౌరవ ప్రతిష్ఠలంతా బజారు పాలైపోతుంది. సంస్థకదా! దీని గౌరవాన్ని నిలుపుకోవాలని ఇంతకాలము నేను చూశాను. మీరు దీనికి ఏమాత్రము లక్ష్యము చేయలేదు. ఇంకా పెరుగుతూ పెరుగుతూ పోతే ముదిరిపోతుంది. ముదిరిపోయిన పొట్లకాయలకు రాళ్లు కడితే క్రిందకు దిగజారి పోతుంది. కనుకనే సమయం వచ్చింది. ఇంకపైన ఊరకుండటానికి వీలులేదు. మంచివాళ్లకు తగిన స్థానము నేనందిస్తాను. నన్ను నేనే ఇచ్చుకుంటాను. కాని చెడ్డవారిని మాత్రం సహించటానికి వీలుకాదు. ఇంక క్షణమైనా కూడను హాస్టలులో ఉంచుకోవటానికి వీలుకాదు. కనుక జాగ్రత్తగా ఉంటుండండి. ఎందుకంటే జగత్తుకంతా ఒక సైన్యముగా మిమ్మల్ని తయారు చేయవలసి ఉంది. ప్రేమకు ప్రాణమైనా ఇస్తాను. చెడుకు ప్రాణమైనా తీస్తాను. ఈ రెండు చక్కగా గుర్తు పెట్టుకోండి.

మా సంస్థ చాలా పవిత్రమైనది. నిస్వార్థమైనది. కేవలము దేశముయొక్క క్షేమము నిమిత్తమై ఏర్పడినది. దేశము బాగుపడుతుందంటే పిల్లలవల్లనే బాగుపడాలి. అలాంటి పిల్లలు ఏ కొద్దిమంది ఉండినా చాలు. మాటలు తగ్గించుకోండి. అనవసరమైన ఆర్గ్యుమెంట్సుకంతా మీరు దిగకండి. మీ పని మీరు చూసుకోండి. మీ చదువును మీరు చదువుకోండి. అవసరము వచ్చినప్పుడు మీరు ఒకరికొకరు చేరి మాట్లాడుకోవచ్చును. discuss చేసుకోవచ్చును. అంతేగాని మిగిలిన వారి విషయాలలో ప్రవేశించకండి. వాడిట్లా వీడిట్లా అని ఇతరుల దూషణ మీలో రాకూడదు. పరుల మీద నీవు పన్నెండు చెప్తే నీపై ఇరవైఆరు చెప్తుంటారు ఇంకొకరు. విద్యార్థులారా! చక్కగా గుర్తించండి వీడు ఇలాంటివాడు, వాడు ఇలాంటివాడు అని ఒక్కవేలు వారిని చూపితే మూడు వేళ్ళు నిన్ను చూపుతుంటాయి. అది మీరు మరచిపోతున్నారు. వాని దోషము చూపుతున్నావు కాని నీ దోషములు మూడు తెలుపుతున్నాయి. కనుక ఇకపైన ఈ విధమైన దోషములు జరుగకుండా, ఈ విధమైన తప్పులు జరగకుండా తగిన జాగ్రత్త తీసుకుంటారని నేను ఆశిస్తున్నాను.

**(తేది. 19-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam